క్లుప్తంగా

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



రౌడీషీటర్లగా నమోదైన వారికి కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై మల్లికార్జునరెడ్డి

జంగారెడ్డిగూడెం: శాంతిభద్రతలకు భంగం కలిగించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై మల్లికార్జునరెడ్డి అన్నారు. జంగారెడ్డిగూడెంలో రౌడీషీట్లు కలిగిన వ్యక్తులకు ఆదివారం ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ తెలిసి గాని, తెలియక గాని ఏదైనా కేసులలో ఉండి రౌడీషీట్ ఓపెన్ అయితే అటువంటి వారు సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. సమాజంలో సత్ప్రవర్తనతో ఉంటే రౌడీషీట్లు తొలగించేందుకు ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న పత్తికొండ ఎమ్మెల్యే



శ్రీవారి ఆలయంలో పత్తికొండ ఎమ్మెల్యే శ్రీదేవి

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చిన వెంకన్న ఆలయాన్ని పత్తికొండ ఎమ్మెల్యే కె.శ్రీదేవి ఆదివారం సందర్శించారు. ముందుగా ఆలయానికి విచ్చేసిన ఆమెకు దేవస్థానం అధికారులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు ఆమెకు వేద ఆశీర్వచనాలు పలికి స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

సీనియర్ సిటిజన్స్ సమావేశం



సీనియర్ సిటిజన్స్ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: బాపూజీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జంగారెడ్డిగూడెం యూనిట్ నెలవారీ సమావేశం ఆదివారం జరిగింది. స్థానిక కిడ్స్ పాఠశాలలో కె.కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అక్టోబర్ 1న జరగబోయే అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా చేపట్టే కార్యక్రమాలపై చర్చించారు. రాష్ట్ర జనరల్ కార్యదర్శి కె.రామచంద్రరావు వృద్ధుల ఆటపాటల షెడ్యూల్‌ను వివరించారు. కార్యక్రమంలో పి.నరసింహరావు, ఎ.తాతారావు, బి.సత్యనారాయణ, రాధాకృష్ణ, బాలకృష్ణ, సూర్యారావు, కె.ఆంజనేయశర్మ, కోరా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

30లోగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్ష ఫీజు చెల్లించాలి

జంగారెడ్డిగూడెం: ఇంటర్ సప్లిమెంటరీ పరీక్ష ఫీజు చెల్లించేందుకు ఈనెల 30వ తేదీ ఆఖరు అని జంగారెడ్డిగూడెం ఎస్‌డీఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బి.వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. 2023 మార్చి పబ్లిక్ పరీక్షల్లో ఫెయిలైన వారితో పాటు, అంతకు ముందు సంవత్సరాల్లో ఫెయిలైన విద్యార్థులు, 2024లో ఇంటర్ పబ్లిక పరీక్షలకు హాజరయ్యేందుకు పరీక్ష ఫీజు 30వ తేదీలోపు చెల్లించాలన్నారు. విద్యార్థులు ఆధార్‌కార్డు జిరాక్స్, విద్యార్థి ఆఖరుగా రాసిన పరీక్షలకు సంబంధించిన మార్కుల మెమోతో కళాశాల కార్యాలయంలో సంప్రదించాలన్నారు.వివరాలకు 94945 86315 నంబరులో సంప్రదించాలని సూచించారు.

కె.జగ్గవరం సొసైటీ మాజీ అధ్యక్షుడు కృష్ణమూర్తి మృతి



టి.నరసాపురం: మండలంలోని కె.జగ్గవరం గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు వెలిది కృష్ణమూర్తి (86) మృతిచెందారు. ఆయన మండలంలోని కె.జగ్గవరం గ్రామంలో సహకార సంఘం అధ్యక్షులుగా సుదీర్ఘ కాలంగా దాదాపు 40 సంవత్సరాలు పనిచేశారు. అదే విధంగా ఐదేళ్లపాటు ఆ గ్రామ సర్పంచ్‌గా బాధ్యతలు నిర్వహించారు. ఇటీవల అనారోగ్యంగా ఉండటంతో హైదరాబాద్‌లో ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందడంతో ఆయన భౌతికకాయాన్ని మండలంలోని ఆయన స్వగ్రామానికి ఆదివారం రాత్రి తీసుకువచ్చారు. కాగా, కె.జగ్గవరం సహకార సంఘం భవన నిర్మాణం కోసం విలువైన స్థలాన్ని ఉచితంగా అందజేశారు.

పూనా ప్యాక్‌పై అవగాహన సదస్సు

ఏలూరు (టూటౌన్): స్థానిక ఎన్ఆర్ పేటలోని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర కార్యాలయంలో 1932 సెప్టెంబర్ 24 పూనా ప్యాక్‌పై అవగాహన సదస్సు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఏవైఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మెండెం సంతోష్ కుమార్ మాట్లాడుతూ పూనా ప్యాక్ కోసం అంబేద్కర్ చేసిన కృషి, వాటి పరిణామాలపై మాట్లాడారు.

పోడుభూమిలో అంతర పంటల సాగు



ఎకరం పొలంలో గిరిజన రైతు వేసిన అంతర పంటలు



అంతర పంటగా బొబ్బర పంట





అంతర పంటగా వేసిన గోంగూర పంట, రైతు పాములేటి లచ్చిరెడ్డి (అంతర చిత్రం)

బుట్టాయగూడెం అది పోడు భూమి. కొండలు, గుట్టలు, చెట్లు, రాళ్లు, తుప్పలు ఎక్కువగా ఉంటాయి. నాగలితో దున్నడమే కష్టసాధ్యం. అలాంటి భూమిలో ఏకంగా ఐదు రకాల పంటలు సాగు చేసి పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నాడు ఓ రైతు. వివరాల్లోకి వెళ్తే.. బుట్టాయగూడెం మండలంలోని అటవీ ప్రాంతంలో మారుమూల గ్రామమైన ముంజులూరు శివారు ఎర్రప్పుట్ల బాట సమీపంలో పాములేటి లచ్చిరెడ్డి అనే కొండరెడ్డి గిరిజనుడు తనకున్న ఎకరం పోడుభూమిలో ఐదు రకాల పంటలు వేశాడు. ప్రధానంగా సామ పంటను సాగు చేస్తుండడంతోపాటు అంతర పంటలుగా చిక్కుడు, గోంగూర, బొబ్బరి, కంది పంటలను వేయడం జరిగింది. పూర్తిగా సేంద్రియ పద్ధతుల్లో ఈ పంటలను పండించడం మరో విశేషం. గత ఏడాది సాగు చేసిన విత్తనాలను ఈ ఏడాది పంటలుగా వేసినట్లు లచ్చిరెడ్డి చెబుతున్నాడు. సామ పంట ఎదిగి చేతికొచ్చేసరికి గోంగూర, బొబ్బరి పంటలు పండుతాయని, ముందుగా చిక్కుడు చేతికొస్తుందని రైతు లచ్చిరెడ్డి తెలిపారు. అవి కేవలం తమ ఆహారం కోసమే పండిస్తున్నానని, సేంద్రియ పద్ధతుల్లో పండించడం వల్ల ఎలాంటి అనారోగ్య సమస్యలు దరిచేరవని చెబుతున్నాడు.

చిరుధాన్యాల పంటలకు ప్రోత్సాహం



చిరుధాన్యాల పంటలను ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది. ముఖ్యంగా కొండ ప్రాంతంలోని పోడు రైతులకు 100 శాతం సబ్సిడీపై రాగులు, జొన్నలు, సామలు వంటి విత్తనాలను అందించడం జరుగుతుంది. ఈ ఏడాది సుమారు 20 క్వింటాళ్ల వరకూ రాగులు, కొర్రలు, గిరిజన రైతులకు పంపిణీ చేశాం.

– బి.సుమలత, ఏఓ, బుట్టాయగూడెం మండలం

ఘనంగా ఎమ్మెల్యే తలారి పుట్టినరోజు వేడుకలు



ఎమ్మెల్యే తలారికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తున్న ద్వారకాతిరుమల మండలం వైఎస్సార్‌సీపీ నేతలు

ద్వారకాతిరుమల: గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు పుట్టినరోజు వేడుకలు దేవరపల్లిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున దేవరపల్లికి తరలివెళ్లి ఎమ్మెల్యేకి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తిమ్మాపురానికి చెందిన వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఆచంట రాకేష్ 175 కేజీల కేక్‌ను ఎమ్మెల్యేచే కట్ చేయించారు. అలాగే క్రేన్ సహాయంతో ఎమ్మెల్యే తలారి దంపతులను గజమాలతో సత్కరించారు. అంతకుముందు ద్వారకాతిరుమల శ్రీవారి దేవస్థానం అర్చకులు, పండితులు ఎమ్మెల్యేకు స్వామివారి శేషవస్త్రాన్ని కప్పి వేద ఆశీర్వచనాలు పలికారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో వేండ్ర త్రినాధరావు ఆయనకు చిన వెంకన్న మొమెంటోను అందజేశారు. అలాగే దొరసానిపాడులో మండల టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు.

అక్షరాస్యత దినోత్సవ ప్రదర్శనకు పురస్కారం



సరిపల్లిలో రికార్డ్స్‌ను అందుకుంటున్న విద్యాసంస్థ ప్రతినిధులు

కొయ్యలగూడెం: అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా తమ విద్యార్థులు ఒక వెయ్యి నూట పదకొండు మందితో నిర్వహించిన ప్రదర్శనకు గాను వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్, తెలుగు బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్, తాన బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లలో చోటు లభించిందని సరిపల్లి ఎంవీఆర్ స్కూల్ ప్రిన్సిపాల్ రవి మహేష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పరిశీలకులు ఊటుకూరి కిరణ్ కుమార్, సిరిమువ్వల శ్రీనివాస్, అల్లూరి రామరాజు హాజరయ్యారన్నారు. ప్రముఖ జానపద రాష్ట్ర కళాకారుడు ఎల్ఆర్ కృష్ణమోహన్ ఆధ్వర్యంలో సామూహిక నృత్య ప్రదర్శనలు, గేయాలు ఆలపిస్తూ విద్యార్థులు అక్షరాస్యత ఆవశ్యకతను చాటిచెప్పారన్నారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల కరస్పాండెంట్ ఆంచేల, ప్రతినిధులకు రికార్డ్స్‌తో కూడిన ధ్రువీకరణ మొమెంటో పత్రాలను అందజేశారు.

కుల నిర్మూలన దృక్పథంతో ముందుకు సాగాలి



మహాత్మా జ్యోతిబా పూలే సత్యశోధక సమాజ్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: కుల నిర్మూలన దృక్పథంతో ముందుకు సాగాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ సభ్యులు కేవీ రమణ పిలుపునిచ్చారు. మహాత్మ జ్యోతిబా పూలే సత్యశోధక సమాజ్ స్థాపించి 151 ఏళ్లు అవుతున్న సందర్భంగా బోసు బొమ్మ సెంటర్లో సభ నిర్వహించారు ఈ సందర్భంగా కేవీ రమణ మాట్లాడుతూ సమాజంలో అన్ని కులాలు సమానత్వంతో ఉండాలని, విద్య ప్రతి ఒక్కరికి అందాలనే లక్ష్యంతో జ్యోతిబాపూలే ఆనాడే సత్యశోధక సమాజ్ స్థాపించారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పీడిత వర్గాలకు విద్యా బోధనలకు తీవ్రస్థాయిలో కృషి చేసిన మహనీయుడని కొనియాడారు. అగ్రవర్ణ దురాహంకార దాడులు, అంటరానితనం, వివక్ష నేటికీ కొనసాగుతుతుండడం బాధాకరమన్నారు. మణిపూర్‌లో ఆదివాసీలపై దాడులు జరిగినా కేంద్రం పట్టించుకోలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఇఫ్టూ నాయకులు గంపల శ్రీను, తాని గడప వెంకటేష్, కొత్తూరు శ్రీను, కాకరపర్తి వెంకటేష్, కొత్తూరు అబ్బులు, ముప్పిడి రామకృష్ణ, కొత్తూరు నాగు, దోసూరి వీరయ్య, సుబ్బారావు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి విరాళం

జంగారెడ్డిగూడెం: సీతామహాలక్ష్మి వృద్ధాశ్రమానికి శఠగోపం కుసుమకుమారి జ్ఞాపకార్థం తులసి శ్రీనివాస్ దంపతులు తమ కుమార్తె గీతా చిన్మయి చేతులమీదుగా ఆదివారం రూ.20 వేలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ ఆశ్రమానికి కావాల్సిన స్థలం చూసుకుంటే దానిని కొనుగోలు చేసి ఇస్తామని వారు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మానవత జిల్లా కన్వీనర్ త్రిపుర రమేష్, సీతామహాలక్ష్మి వృద్ధాశ్రమ నిర్వాహకులు శేఖర్, ఆశ్రమంలోని వృద్ధులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల ఆందోళన

జంగారెడ్డిగూడెం: మున్సిపాలిటీలలో పనిచేసే పారిశుధ్య, ఇంజనీరింగ్ విభాగ కార్మికులకు హెల్త్ అలవెన్సులు వెంటనే చెల్లించాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా అధ్యక్షుడు కూన పాముల విగ్నేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు దశలవారీగా నిర్వహిస్తున్న ఆందోళన కార్యక్రమాలు ఆదివారం నాలుగో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా స్థానిక పొట్టి శ్రీరాములు సెంటర్లో కార్మికులు మానవహారం నిర్మించారు.

జిల్లా స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



జిల్లా స్థాయి ఆటల పోటీలకు ఎంపికైన విద్యార్థులు

కొయ్యలగూడెం: జిల్లాస్థాయి ఆటల పోటీలకు తమ స్కూల్ నుంచి నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారని గవరవరం ఆగ్జీలియం స్కూల్ ప్రిన్సిపాల్ దేవమణి తెలిపారు. జీలుగుమిల్లి మండలం బర్రింకలపాడులో రాష్ట్రస్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో అండర్-17 వంద మీటర్ల రన్నింగ్ విభాగంలో రాధా ప్రకాష్, నాలుగు వందల మీటర్ల రన్నింగ్ విభాగంలో సంజయ్, ఎం.చాందిని, అండర్-14 విభాగంలో 400 మీటర్స్ విభాగం నుంచి పి.నిహారిక పోటీలలో ప్రతిభ కనపరిచి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను పీఈటి వరికూటి శ్రీనివాస్, ఉపాధ్యాయులు అభినందించారు.

రామాలయ నిర్మాణానికి విరాళం



ఆంజనేయస్వామి ఆలయంలో బీవీఎస్ రెడ్డిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

లింగపాలెం: మఠంగూడెం గ్రామంలో శ్రీకోదండ రామాలయ నిర్మాణానికి లింగపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత, మైత్రి డెవలప్పర్స్ అధినేత భీమిరెడ్డి వెంకటసూరారెడ్డి (బీవీఎస్ రెడ్డి) రూ.50 వేలు విరాళం అందజేశారు. ఈమేరకు కమిటీ ఆధ్వర్యంలో బీవీఎస్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. అనంతరం లింగపాలెం, మఠంగూడెం గ్రామాల్లో గణపతి నవరాత్రుల ఉత్సవాలను పురస్కరించుకొని ఐదు దేవాలయాల్లో ఒకొక్క ఆలయానికి రూ.5 వేలు చొప్పున ఆయన విరాళం అందజేశారు. ఈ సందర్భంగా బీవీఎస్ రెడ్డి మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధికి తనవంతు సహాయం అందజేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ మండలపు సాయిబాబు, గ్రామ సర్పంచ్ పి.ప్రసాద్, మండల వైఎస్సార్ సీపీ ముఖ్యనేత ముసునూరి వెంకటేశ్వరరావు, చిలుకూరి రఘునాధరెడ్డి, రామకృష్ణ, రెడ్డి బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

లిడ్ క్యాప్ డైరెక్టర్ సందీప్‌నకు సత్కారం



సందీప్‌ను సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

లింగపాలెం: ధర్మాజీగూడెం సీఎస్ఐ దేవాలయంలో ఆదివారం స్టేట్ లిడ్ క్యాప్ డైరెక్టర్ సొంగా సందీప్‌ను చర్చి ఫాస్టర్, సంఘస్థులు, వైఎస్సార్ సీపీ నాయకులు ఘనంగా సన్మానించారు. స్వచ్ఛందంగా వివిధ సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకుంటున్న సందీప్ సందీప్ మరిన్ని ఉన్నత పదవులను అధిరోహించాలని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం సందీప్ మాట్లాడుతూ తనకు లిడ్ క్యాప్ డైరెక్టర్ పదవి బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ ఉప్పలపాటి వర ప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు మోరంపూడి జగన్, మేకల రాజు, మందలపు వేణు, చల్లా గంగాధరరావు, నూతలపాటి శ్రీను, షేక్ వలీ, గారపాటి రాంబాబు, గుండిమేడ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బధిరుల, సంజ్ఞా భాషా దినోత్సవం



బధిర దివ్యాంగునకు టచ్‌ఫోన్‌ను అందజేస్తున్న తహసీల్దార్ సోమశేఖర్

ఏలూరు (టూటౌన్): ప్రపంచ బధిరుల, సంజ్ఞా భాషా అంతర్జాతీయ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాస్థాయి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక కలెక్టరేట్ సమీపంలోని గిరిజన భవన్ నందు ఈ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ దివ్యాంగుల పట్ల ప్రేమాభిమానాలు చూపించాలన్నారు. ముగ్గురు బధిర దివ్యాంగులకు టచ్‌ఫోన్‌లను అందజేశారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, అధికారులు పాల్గొన్నారు.

రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు

పెదవేగి : రాట్నాలకుంటలో వేంచేసిన రాట్నాలమ్మ తల్లికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఈ వారం అమ్మవారికి పూజా టికెట్ల విక్రయం ద్వారా రూ.30,870, విరాళాలు రూ. 8,253, లడ్డూ ప్రసాదం విక్రయంతో రూ.20,625, ఫొటో విక్రయంతో రూ.1,860, మొత్తం రూ.61,608 ఆదాయం లభించిందని దేవస్థాన చైర్మన్ చల్లగొళ్ళ వెంకటేశ్వరరావు చెప్పారు.

విద్యార్థులు సామాజిక సేవ అలవర్చుకోవాలి



కళాశాల ఆవరణలో వివిధ పండ్ల మొక్కలను నాటిన దృశ్యం

కామవరపుకోట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం దినోత్సవాన్ని కళాశాల ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ ఎం.మల్లేశ్వరరావు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. కళాశాల ఆవరణలో వివిధ రకాల పండ్ల మొక్కలను నాటారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా.జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ జాతీయ సేవా పథకం ఆవిర్భావం, లక్ష్యాలు, విధులు వలంటీర్లు చేయాల్సిన వివిధ కార్యక్రమాల గురించి విద్యార్థులకు వివరించారు. విద్యార్థి దశనుంచే సామాజిక సేవా కార్యక్రమాలు అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఎం.ఉషారాణి, కె.ఇందిరాకుమారి, వి.శ్రీనివాస్, ఎ.హర్షవర్ధిని, సిబ్బంది పాల్గొన్నారు.

యువకులపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: తాగిన మైకంలో పోలీస్ స్టేషన్ ఎదుట ఆదివారం ముగ్గురు యువకులు వీరంగం సృష్టించారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన కోటపోయల సత్య వరప్రసాద్, ముళ్ళపూడి భానుప్రసాద్, షేక్ బాషా అనే యువకులు స్థానిక బైపాస్ రోడ్‌లో ఓ దాబ వద్ద మద్యం సేవించి పక్కనే ఉన్న ఢిల్లీ దుకాణం వారితో ఘర్షణకు దిగారు. దుకాణంలోని సామాన్లు ధ్వంసం చేయడంతో, దుకాణ యజమానురాలు చంద్రకళ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ముగ్గురు యువకులను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అయితే పూటుగా మద్యం సేవించిన యువకులు స్టేషన్ వద్ద పోలీసులతో వాగ్వివాదానికి దిగారు. స్టేషన్ బయట రహదారిపై బైఠాయించి వీరంగం సృష్టించారు. దీంతో ఎస్సై మల్లికార్జున్‌రెడ్డి యువకులకు కౌన్సిలింగ్ చేశారు. ఘటనకు సంబంధించి దుకాణ యజమాని చంద్రకళ ఫిర్యాదు మేరకు ముగ్గురు యువకులపై కేసు నమోదు చేశారు.

నేటి నుంచి బాపట్లలో బీకేఎంయూ రాష్ట్ర మహాసభలు

ఏలూరు (టూటౌన్): ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం (బీకేఎంయూ) 22వ రాష్ట్ర మహాసభలు ఈనెల 25వ తేదీ నుంచి మూడు రోజుల పాటు బాపట్లలో జరుగుతున్నట్లు సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవన్ నందు మహాసభల వివరాలను ఆదివారం వెల్లడించారు. 26, 27 తేదీల్లో ప్రతినిధుల సభకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నుంచి 50 మంది హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.

గ్రామాల్లో జగనన్న సురక్ష సర్వే



కుక్కునూరులో వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది



జంగారెడ్డిగూడెంలో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న దృశ్యం



వృద్ధురాలికి ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

కుక్కునూరు: మండలంలోని రెండు పీహెచ్‌సీల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఆదివారం జగనన్న ఆరోగ్య సరక్ష సర్వే నిర్వహించారు. వైద్య సిబ్బంది ప్రతి ఇంటికీ వైద్య పరీక్షలు చేశారు. బీపీ, షుగర్, యూరిన్ పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్యసేవలకుగాను జగనన్న ఆరోగ్య సురక్ష టోకెన్‌లను అందించారు. జగనన్న ఆరోగ్య సురక్షా శిబిరాలకు వచ్చి స్పెషలిస్ట్ డాక్టర్లతో వైద్యం చేయించుకోవాలని సూచించారు.

జంగారెడ్డిగూడెం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జంగారెడ్డిగూడెంలో చురుగ్గా సాగుతోంది. కమ్యూనిటీ హెల్త్ అధికారులు, ఏఎన్ఎంలు, ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. అలాగే ఆయా ఇళ్లకు వెళ్లి కుటుంబసభ్యుల వివరాలు, ఆరోగ్య సంబంధిత విషయాలు తెలుసుకుంటున్నారు. జంగారెడ్డిగూడెం పట్టణంలో ఆదివారం ఇంటింటి సర్వే నిర్వహించడంతో పాటు వృద్ధులు, అనారోగ్యంతో ఉన్న వారు తదితరులకు వైద్యపరీక్షలు నిర్వహించారు.

అట్టహాసంగా గణేష్ నిమజ్జనోత్సవాలు



జంగారెడ్డిగూడెంలో వినాయకుడి ఊరేగింపు



కొయ్యలగూడెంలో గణనాథుని ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం



లింగపాలెంలో ట్రాక్టర్‌పై వినాయకుడి ఊరేగింపు

కొయ్యలగూడెం: వినాయక చవితి ఉత్సవాలలో భాగంగా ఏడవ రోజు ఆదివారం గణనాథుల ఊరేగింపు నిమజ్జనోత్సవాలు, అన్న సమారాధనలు మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. కొయ్యలగూడెం రామాలయం వాటర్ ట్యాంకు వద్ద చిన్నారులు బాల గణనాథుని ఊరేగింపు కార్యక్రమం బాణసంచా, డప్పుల వాయిద్యాల నడుమ నిర్వహించారు. సూర్య రెసిడెన్సి వీధిలో బాల భక్త సంఘం ఆధ్వర్యంలో చిన్నారులు అన్నసమారాధన నిర్వహించారు. కన్నాపురం సమీపంలోని మహదేవపురంలో ఎడ్ల బండిపై గణనాథుని ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. బయ్యనగూడెం, రాజవరం రింగు రోడ్డు గ్రామాలలో గణపతి ఉత్సవ ఊరేగింపులు నిర్వహించారు.

ద్వారకాతిరుమల: గణేష్ నిమజ్జన వేడుకలు మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం అట్టహాసంగా జరిగాయి. వేంపాడు, ద్వారకాతిరుమల, సూర్యచంద్రరావు పేట తదితర గ్రామాల్లో ఉత్సవ కమిటీ నిర్వాహకులు ముందుగా గణేష్ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో ఉంచారు. పూజల అనంతరం తీన్‌మాన్ డప్పు వాయిద్యాలు, డీజే సందళ్లు, బాణసంచా కాల్పుల నడుమ గ్రామంలో ఊరేగించారు. రాత్రి స్థానిక కోనేరులో గణేష్ విగ్రహాలను నిమజ్జనం చేశారు.

జంగారెడ్డిగూడెం: పట్టణంలో గణేష్ నిమజ్జనోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని జెడ్పీ హైస్కూల్ వద్ద ఏర్పాటు చేసిన గణనాథుడి పందిర వద్ద ఆదివారం అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం గణనాథుడి ప్రతిమను వాహనంపై పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించి, అనంతరం నిమజ్జనం చేశారు.

లింగపాలెం: లింగపాలెం, మఠంగూడెం, బాదరాల, కె గోకవరం, ధర్మాజీగూడెం తదితర గ్రామాల్లో వినాయక ఊరేగింపులు వైభవంగా నిర్వహించారు. భక్తుల జయజయ ధ్వానాల నడుమ గణేస్ ప్రతిమలను ఊరేగించి చెరువుల్లో నిమజ్జనం చేశారు. ఈమేరకు భక్తులకు ప్రసాదాలు అందజేశారు.